
ప్రజాశక్తి
మంగళవారం 29 జులై 2025





విఆర్ఎలకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-నెల్లూరు :గ్రామ రెవెన్యూ సహాయకులకు (విఆర్ఏ) కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (విఆర్ఏ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వి ఆర్ సి గ్రౌండ్ నుండి, కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు బందగీ సాహెబ్, జిల్లా గౌరవ అధ్యక్షులు కే. పెంచల నరసయ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏ లందరినీ ప్రభుత్వ ఉద్యోగలుగా గుర్తించి, పే స్కేలు అమలు చేస్తున్నారన్నారు. నామినిలుగా సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న వారిని విఆర్ఏ లు గా గుర్తించడం లేదు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు.విఆర్ఎలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. లచ్చయ్య, ఓబులేసు, సుబ్బయ్య, సుధాకర్, అమీర్, శ్రీనివాసులు, నారాయణ, రమేష్, బాలు, అమరావతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విఆర్ఎలు

'కుబేరా' స్కామ్ నీరుగారిపోతోందా..?

నెల్లూరు యాక్సెస్ బ్యాంక్‌లో జరిగిన భారీ కుంభకోణం విషయంలో పోలీసు విచారణ ఆలస్యం అయ్యేలా కనిపిస్తోంది... ప్రజల ధనం అక్రమార్కుల జేబులోకి వెళ్లినా...అనేక మంది నిరుపేద ప్రజలు గగ్గోలు పెడుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కనిపించడం లేదు... బ్యాంక్ అధికారులు నాన్చుడిధోరణీ ప్రదర్శిస్తున్నారు... ఇప్పటి వరకు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోడానికి ఏలాంటి చర్యలూ కనిపించడం లేదు. ఈ కుంభకోణంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నా, యాక్సెస్ బ్యాంక్ ఉన్నతాధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది... నెల్లూరు రూరల్ పోలీసులు వివిధ కేసులతో బిజీబిజీగా ఉన్నారు. నిన్నటి వరకు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో విచారణ చేపట్టారు.

- **బ్యాంక్ అధికారుల నాన్చుడిధోరణి**
- **పోలీసులు బిజీ బిజీ**
- **ప్రభుత్వం మొద్దు నిద్ర**
- **అక్రమార్కులు తప్పించుకోడానికి వ్యూహాలు**
- **బాధితుల లబోదిబో**
- **సిఐడి, లేదా సిట్ కోసం ఎదురుచూపులు**

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులో జరిగిన యాక్సెస్ బ్యాంక్ కుంభకోణం రాష్ట్ర వ్యాపితంగా సంచలనం కలిగింది..ఇలాంటి మోసాలు కూడా చేస్తారా ? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. "కుబేరా నెల్లూరు " పేరుతో 'ప్రజాశక్తి"లో ప్రచురితమైన విషయం తెలిసిందే. మీడియాలో రావడంతో నెల్లూరు రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు ప్రత్యేకంగా ధర్యాప్తు ప్రారంభించారు. బ్యాంక్ అధికారులతో ఇప్పటి రెండు సార్లు భేటి అయ్యారు. ఏడు నెలల క్రితం కేసు పెట్టిన బ్యాంక్ అధికారుల వద్ద ఈ కేసుకు సంబంధించి ఎలాంటి ఫైల్స్ లేవని చెప్పడం విడ్డూరంగా ఉంది. 56 మంది వివరాలు, ఫైల్స్ తనకు అందించాలని ఇప్పటికే డిఎస్‌పి బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బ్యాంక్ అధికారుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. తమకు వారం రోజులు సమయం కావాలని బ్యాంక్ అధికారులు కోరినట్లు తెలిసింది. ఏడు నెలల క్రితమే కేసు పెట్టిన బ్యాంక్ అధికారుల వద్ద బాధితుల రికార్డులు అందుబాటులో లేకపోవడం నిజంగా విచిత్రమే. యాక్సెస్ బ్యాంక్ అధికారులు ఇంటర్‌నెల్ ఆడిట్ నిర్వహించి ఏం తేల్చారో తెలియడం లేదు. బాధితులు చెప్పిన వివరాలు మేరకు.. అవినీతి, అక్రమాలు, బ్యాంక్ నగదు దోపిడీ చేసిన విషయాలు అంతా బ్యాంక్ అధికారులకు తెలుసునని సమాచారం. కేవలం నెల్లూరు యాక్సెస్ బ్యాంక్‌లోనే కాకుండా చెన్నయ్, విశాఖపట్నం, జగ్గయ్యపేట, కాకినాడ ఇలా యాక్సెస్ బ్యాంక్‌లో అనేక చోట్ల ఈ ముఠా దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. కేవలం నెల్లూరే కాకుండా యాక్సెస్ బ్యాంక్ అన్ని బ్రాంచ్‌ల్లో ఈ తరహా దోపిడీ జరిగిందో నిగ్గు తేల్చాల్సి ఉంది. ఈ ఒక్క ముఠానే చేసింది ?. రాష్ట్రంలో మరికొన్ని ముఠాలున్నాయా ?, జరిగితే ఏమేరకు చేస్తారు ? ఇలాంటి విషయాలను బ్యాంక్ అధికారులు బయట పెట్టాల్సి ఉంది.బ్యాంక్ ఖాతాదారుల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది. తమ ఖాతాలు వెనక్కి తీసుకోడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. యాక్సెస్ బ్యాంక్‌లో పనిచేసే అధికారులు, సిబ్బందిని దొంగల్లా చూస్తున్నారు.



కుబేరా కేసు నీరుగారుతొందా..?

నెల్లూరు యాక్సెస్ బ్యాంకు కుంభకోణంతో విషయంలో రాష్ట్రమంత్రా ఏం జరిగింది. ? ఎవరు బాధ్యులు ? ఎంత నగదు దోపిడీ చేశారు ? అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాని చీమకుట్టినట్లు కూడా లేదు. ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లో ఏడు నెలల క్రితం కేసు సమోదు చేశారు. ఇప్పుడు బాధితులు ఆందోళనతో కేసులు పెడుతున్నా పోలీసులు తీసుకోవడం లేదు. ముత్తుకూరు కేసు సరిపోతోందని సర్దిచెబుతున్నారు. బాధితులు చెప్పిన కథలు మీడియాలో పుంకాలు పుంకాలుగా వచ్చాయి. 1. జాలే వాసుదేవనాయుడు 2. అల్లాభక్ష 3. శివకుమార్ 4. వెంకటేష్‌లు పేక్ సాఫ్ట్‌వేర్ పేరుతో ఈ మోసానికి పాల్పడ్డారని, 1. అవి నెట్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్.. 2. ఎంఆర్ ఇఫ్రా లైన్, 3. గ్లోబల్ సోల్యూషన్ 4. క్యాపిటల్ ట్రీ స్టాఫ్ వేర్ కంపెనీల పేరుతో వ్యవహారం నడిపిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు పోలీసులు తూతూ మంత్రంగానే దర్యాప్తు చేశారు. ఎంతో కీలక మైన ఈ కేసు ఆలస్యం అయ్యేలా కనిపిస్తోంది. ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నల్లపరెడ్డిప్రసన్నకుమార్‌రెడ్డి కేసులో దర్యాప్తు ముమ్మరం చేశారు. పలువురిని విచారించారు.ఈనెల 31న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు రానున్నారు ఇప్పుడు పోలీసులంతా ఆ ఏర్పాట్లలో నిమగ్న మయ్యారు.

నెల్లూరులో పలు కుంభకోణాలు...?

గతంలో అగ్రిగోల్డ్, అక్షయ గోల్డ్ కంపెనీలు భారీ కుంభకోణం చేశాయి. సుమారు రూ.200 కోట్లు దోపిడీ జరిగింది. అప్పట్లో "ప్రజాశక్తి" ఈ కుంభకోణం బయటపెట్టింది. ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు.

మున్సిపల్ కార్మికులపై లాఠీ-ఛార్జ్..!

14 రోజులుగా సమ్మె
-20మంది వర్కర్లు స్టేషన్‌కు తరలింపు
-పలువురికి గాయాలు

ప్రజాశక్తి-నెల్లూరు :మున్సిపల్ కార్మికుల సమ్మెపై పోలీసులు లాఠీలు ఝళిపించారు. కార్మికులు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం 14 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కార్పొరేషన్ పరిధిలోని కార్మికులు కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. పారిశుధ్య పనులను ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పగించి కార్మికుల కడుపకొట్టదంటూ గడిచిన 14 రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శాంతియుతంగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నిప్పో, అయ్యప్ప గుడి సెంటర్లో పోటీ కార్మికులు చేత అధికారులు పనిచేయిస్తుండగా, మున్సిపల్ కార్మికులు అక్కడికి చేరుకొని మా పనులను ప్రయివేటు కాంట్రాక్టర్లకు ఇచ్చి మా కడుపులు కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. దయచేసి మీరు అర్థం చేసుకొని పోటీ కార్మికులుగా రావద్దని, మనమందరం పేదవాళ్లమే, దళితులమని కార్మికులకు నచ్చజెప్పుకున్నారు. అక్కడ నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్మికులు వేదాయపాలెం సెంటర్‌కు ప్రదర్శనగా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. చెత్త ఎత్తుతున్న పోటీ కార్మికులు చేస్తున్న పనికి సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుతగులుతున్నారంటూ పోలీసులకు సమాచారం తెలియడంతో వేదాయపాళెం పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిం చడంతోపాటు, పత్రికల్లో రాయలేనటువంటి మాటలు మాట్లాడారు. అక్కడే ఉన్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ అధ్యక్షులు దేశమూర్తి 'సార్ మహిళలతో మర్యాదగా వ్యవహరించడం.. అసభ్యకరంగా మాట్లాడటం పద్ధతి కాదు' అని అంటూ పోలీసులను ప్రశ్నించడంతో, ఒక్కసారిగా మహిళలు సైతం పోలీసులను నిలదీశారు. ఈ సమయంలో పోలీసులకు మున్సిపల్ వర్కర్స్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కొంత మంది మున్సిపల్ కార్మికులను పోలీసు వాహనం ఎక్కించడంతో మహిళ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో మహిళా కార్మికులను సైతం పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు స్టేషన్‌కు కార్మికులను తరలించారన్న సమాచారం తెలుసుకున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్, సిఐ శ్రీనివాసరావు తో మాట్లాడుతుండగా ముందు వీరిని పోలీస్ స్టేషన్ లో పడేయండి అని దురుసుగా ప్రవర్తించారు. పోలీస్ స్టేషన్ లోకి తీసుకెళ్లారు. మున్సిపల్ కార్మికులు పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించి పెద్ద ఎత్తున పోలీసు చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐ శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగి లాఠీ తీసుకొని అక్కడున్న పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జీ చేశారు. 20 మంది గాయాలపాలయ్యారు. ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఏబిఎం కాంపౌండ్ నుంచి పప్పులవీధి, జలకన్య తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు రూరల్ ప్రాంతంలో తమ తోటి కార్మికులను పోలీసులు స్టేషన్‌కు తరలించడం, లాఠీ ఛార్జీ చేయడం, కొంత మందికి గాయాలైనట్లు సమాచారం తెలియడంతో ప్రదర్శనను అర్ధాంతరంగా నిలిపివేసి హుటాహుటిన వేదాయపాళెం పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. భారీగా మున్సిపల్ కార్మికులు పోలీసు స్టేషన్ ప్రాంతానికి చేరుకొని పోలీసు చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. సిఐ శ్రీనివాసరావు తిరిగి మరలా మున్సిపల్ కార్మికుల వద్దకు చేరుకొని పోలీసు స్టేషన్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని, ఆ విధంగా చేయని పక్షంలో జిల్లాలోని పోలీసు యంత్రాంగాన్ని మొత్తం ఇక్కడకు తీసుకొస్తామంటూ హెచ్చరించారు." 40 సంవత్సరాలకు పైగా కాంట్రాక్టు పద్ధతిలో, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల కడుపుకొట్టే ప్రయత్నంలో భాగంగా పారిశుధ్య పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించరాదని శాంతియుతంగా పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసు ప్రతాపం ఎందుకు సార్ " అంటూ ఆ ప్రాంతానికి చేరుకున్న సిపిఎం నాయకులు పోలీసు అధికారులతో మాట్లాడారు. అనంతరం నాయకులు మున్సిపల్ కార్మికులతో మాట్లాడి పోలీసు స్టేషన్‌లోని వెళ్లి సిఐ శ్రీనివాసరావుతో మాట్లాడి, కార్మికుల సమస్యను వివరించి పోలీసు స్టేషన్‌లో ఉన్న కార్మికులందరినీ సొంత పూచికత్తుపై బయటకు తీసుకురావడంతో ఆ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెలకొంది.అనంతరం మీడియాతో నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికుల పైన, వేదయపాలెం సిఐ శ్రీనివాసరావు దురుసుగా వ్యవహరించడం, వారిని కొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. మున్సిపల్ కార్మికులందరూ దళితులు గిరిజనులు, వారిపై ఇంత అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించే దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించలే తప్ప ఈ రకంగా నిర్బంధాలు పెట్టడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, యూనియన్ జిల్లా కార్యదర్శి కే. పెంచల నరసయ్య, సిఐటియు నగర కార్యదర్శి జి. నాగేశ్వరరావు సిఐటియు నాయకులు పి. సూర్యనారాయణ, కే. సతీష్, నాగేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు శివాజీ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులపై లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

మున్సిపల్ వర్కర్స్‌పై లాఠీ ఛార్జీ అమానుషం

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం చూపించాలని 14 రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే పట్టించుకోకుండా , చర్చలకు ఆహ్వానించకుండా మొండి వైఖరి అవలంభిస్తూ, శాంతి యుతంగా పోటీ కార్మికులకు తమ బాధను చెప్పుకొని వెళ్లిపోవాలంటూ ప్రాధేయపడుతున్న మున్సిపల్ కార్మికులను పోలీసు అరెస్టు చేయడం దారుణం అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. కార్మికులను పోలీసులు అరెస్టు చేసిన సమాచారం తెలుసుకున్న తోటి కార్మికులు పోలీసు స్టేషన్ ప్రాంతానికి చేరుకొని, పోలీసులు వ్యవహరించిన విధానాన్ని ప్రశ్నించిన నాయకులు పట్ల దురుసుగా వ్యవహరించడమే కాకుండా మహిళలు అని చూడకుండా లాఠీ ఛార్జీలకు దిగడం హేయమన్నారు. పోలీసు చర్యలను సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

ఐద్వా, ఆవాజ్ ఖండన

కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులపై లాఠీఛార్జిజ దారుమి ఐద్వా నగర, రూరల్ కమిటీ నాయకులు కత్తి పద్మా, విజయలక్ష్మి, ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ రఫీ,షేక్ రషీద్ లు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలోఖండించారు. కార్మికులపై లాఠీఛార్జి చేసిన సిఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ముగిసిన వడ్డెర రాష్ట్ర మహాసభలు

అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటయ్య, దయాకర్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలు ముగిశాయి. రెండు రోజుల పాటు ఇక్కడ ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో జరిగిన సభలో పలు తీర్మానాలు చేశారు. సోమవారం ఉదయం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై అన్ని జిల్లాల నుంచి వచ్చిన 150 మంది ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై చర్చించారు. కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. 1) ఎస్సీ ఎస్టీ ల మాదిరిగా వడ్డెర్లకు కూడా సామాజిక రక్షణ చట్టం ప్రభుత్వం వెంటనే తీసుకొని వచ్చి వడ్డెరలకు, వడ్డెర మహిళలకు ,పిల్లలకు వృద్ధులకు రక్షణ కల్పించాలని తీర్మానించింది.2) ప్రతి వడ్డెర కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని, రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వడం ద్వారా వలసలను అరికట్టాలని తీర్మానించింది. .3) వడ్డెర వృత్తిదారులు మట్టి పని కంకర క్వారీలలో పనులు చేయడంతో 50 సంవత్సరాల కంటే ఎక్కువకాలం పని చేయలేరు కనుక వడ్డెర్లకే 50 సంవత్సరాలు నిండిన వారికి వధా పెన్షన్ ప్రతి ఒక్క వత్తిదారునికి ఇవ్వాలని ప్రతినిధుల సభ తీర్మానించినది.4) వడ్డెరలకు , వడ్డెర వత్తిదారులకు కంకర కోరీలు, గ్రావెల్ ఎర్ర మట్టి కొండలు, వాటిపైన 50% హక్కు కల్పించాలని,క్వారీలలో పనిచేస్తున్న వత్తిదారులకు సీనరీస్ చార్జీలు మినహాయించాలని వడ్డెర సొసైటీలకు కాంట్రాక్ట్ వర్కులు ఈఎండి లేకుండా అనుమతించాలని 20 శాతం వర్కులను వడ్డెర సొసైటీలకు ఇచ్చి వడ్డెర యువతకు జీవనోపాధి కల్పించాలని సభ తీర్మానాన్ని ఆమోదించింది.5) రాష్ట్ర ప్రభుత్వాము వడ్డెర కార్పొరేషన్ కు బడ్జెట్లో 1000 కోట్లు నిధులు కేటాయించి విధి విధానాలు ప్రకటించి ఆ నిధులను నిధులు వడ్డెరల సంక్షేమానికి అభివృద్ధికి ఖర్చు చేయాలని తీర్మానించినది. నూతన కమిటీని ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.



అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, దయాకర్

నూతన కమిటీ ఎన్నిక

ఎపి వడ్డేర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులుగా చల్లా వెంకటయ్య, గుంజి దయాకర్‌తో పాటు పలువురిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కోశాధికారిగా చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, జెరిపిటి మోహన్, సహాయ కార్యదర్శిగా తన్నీరు శ్రీరాములు, దేరంగుల పద్మనాభ రాజు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కోటకొండ వెంకటేష్, , బత్తుల రత్నయ్య, మళ్లీ నాగార్జున్ తమ్మిశెట్టి, నాగ గండికోట శంకర్, విరగదండ్ల రమణ, బత్తుల గంగయ్య ఎన్నికయ్యారు

హాస్టళ్ల ప్రయివేటీకరణకు కుట్ర : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు :బిసి సంక్షేమ వసతి గృహాలను పి.4 ద్వారా అభివద్ధి చేస్తామని బిసి శాఖ మంత్రి ప్రకటించడం సరికాదని పి.4 తో సంక్షేమ హాస్టల్లు ప్రైవేటీకరణ లేదా మూసివేతకు దారి తీస్తాయని అటువంటి ఆలోచన విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఎస్ఎఫ్ఐ పొదలకూరు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తోడేటి విక్రమ్, వెన్ను.నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయన్నారు. ఇప్పటికే ఉన్నత న్యాయస్థానం హాస్టళ్ల స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని వ్యాఖ్యానించిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచే ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ సమస్యల గురించి మాట్లాడకుండా పి 4 ద్వారా అభివద్ధి చేస్తామని చెప్పడంలో కుట్ర ఉందన్నారు.



పారిశుధ్య కార్మికుల నిరసన

నెల్లూరు :మున్సిపల్ కార్మికులపై అసత్య ప్రచారాలు మానాలి. టెండర్లు రద్దు చేయాలని, కార్మికుల పనిని కాంట్రాక్టర్లకు అప్పగించే చర్యలు నిలిపివేయాలని, టెండర్లు రద్దు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం మునిసిపల్ కార్మికుల సమ్మె పోరాటంలో భాగంగా బోసు బొమ్మ ఏబీఎం కాంపౌండ్ నుండి పప్పులవీధి సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, రూరల్ కార్యదర్శి కే పెంచల నరసయ్య నాయకులు కొండా ప్రసాద్,సిఐటీయూ నగర నాయకులు పి సూర్యనారాయణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు :25, 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగిన పదో ఓపెన్ టైక్వాండో జాతీయస్థాయి పోటీలలో పతకాలు సాధించారని ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ , జిల్లా కార్యదర్శి అయిన ఎస్.కె అబ్దుల్ సలాం తెలిపారు. ఈ పోటీలలో దేశ నలుమూలల నుంచి సుమారు 1300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా క్రీడా శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి , కృష్ణాజిల్లాకలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ షా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు.

నిందితుడు అరెస్ట్

కందుకూరు :ఇక్కడ ముసుగువేసిన కేటుగాడి పేరు వి రమేష్ బాబు. వయసు 50 ఏళ్లు. కందుకూరుకి చెందిన వ్యక్తి. గత కొంతకాలంగా ఆర్‌టిసి బస్సుల్లో దొంగతనం చేయడంలో మంచి చేతివాటం ఉన్న వ్యక్తి. బస్సుల్లో ప్రయాణించేవారు బ్యాగులను బస్సుల్లో పెట్టి ఆర్ఇసి బస్టాండ్ లో టిఫిన్ కి లేదా భోజనానికి దిగినప్పుడు గమనిస్తాడు. వారు బస్సు దిగి వెళ్ళగానే ఆ వస్తువులు కొట్టేసేవాడు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ లో రెండేళ్ల నుంచి ఇదే పనిలో ఉన్నాడు. పగల దొంగతనాలు చేసి రాత్రికి కందుకూరు వచ్చి రెస్ట్ తీసు కుంటాడని పోలీసుల విచారణలో తెలింది. ఇప్పటిదాకా లెక్కలేని డబ్బులు, వస్తువులు, 10 ల్యాప్ టాప్ లు దొంగిలించాడు.ఇటీవల ఒక ప్రయాణికుడు ఇచ్చిన కంప్లైంట్ తో ఒంగోలు పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి రమేష్ బాబును పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అతని వద్ద 2.5 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

తహశీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - లింగసముద్రం :లింగసముద్రం తహశీల్దార్ గా ఎమ్.కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొండాపురం తహశీల్దారుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికివచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ సీతామహాలక్ష్మి కందుకూరు బదిలీ అయ్యారు.

సుపరిపాలనలో తొలి అడుగు

వలేటివారిపాలెం : రాష్ట్రంలో సిఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలోని ఎస్సీ కాలనీలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు వలేటి శ్రీధర్ నాయుడు ఉన్నారు.


నిమ్మచెట్లు తొలగింపు అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి-సైదాపురంమండలంలోఇమొలకలపగాండ్ల రెవెన్యూ పరిధిలోని 793 సర్వే నెంబర్ లో నిమ్మ సాగు చేసుకుంటున్న పేదల భూములను మూడు రోజుల క్రితం తొలగించిన విషయం తెలిసిందే.సోమవారం సిపిఎం నాయకులు కమ్మవారి పల్లి గ్రామంలోని నిమ్మ చెట్లు తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించి అనంతరం రైతులతో కలిసి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ మాట్లాడుతూ పేదల సాగు చేసుకుంటున్నా నిమ్మమ చెట్లను అధికారులు తొలగించడం చాలా దారుణమన్నారు. పేదల సాగు చేసుకుంటున్నా భూములకు అసైన్డ్‌మెంట్ పట్టాలు, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసి పేదల సాగుకు అవకాశం కల్పించకుండా సాగు చేసుకుంటున్న భూముల్లోని నిమ్మ చెట్లను తొలగించటం అధికారులకు సబబు కాదన్నారు. దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను తొలగించాలని చూస్తే సిపిఎం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేసా _మని అధికారులను హెచ్చరించారు. శ్రీని వాసులు, రైతులు రమణమ్మ, శీనయ్య, శివయ్య, కిష్టమ్మ, నాగేంద్ర, బాలు పాల్గొన్నారు.

ఎంసి చైర్మన్ రేసులో రెబ్బవరపు మాధవి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కూటమి ప్రభుత్వం ఎస్సీ మహిళకు కేటాయించడం పట్ల ఆ సామాజిక వర్గానికి సంబంధించిన నాయకులు , కార్యకర్తలు హర్షం చేస్తున్నారు. ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావును క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు మాల్యాద్రి ఆధ్వర్యంలో మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన నాయకులు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రెబ్బవరపు మాధవికి ఏఎంసి చైర్మెన్ గా అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు . స్పందించిన ఎంఎల్ఎ నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలబడి , కష్టపడి పనిచేసిన వారిని అధిష్టానం గుర్తుపెట్టుకొని అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావుని కలిసిన వారిలో నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ , ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య , నెల్లూరు పార్లమెంటు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు అక్కిలగుంట ప్రకాశం , కందుకూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గోచిపాతల ప్రసాదు , పూండ్ల పెంచలయ్య , కార్యనిర్వహక కార్యదర్శి గౌడపేరు ప్రసాద్ రావు , తెలుగుయువత ఉపాధ్యక్షులు జడ రవీంద్ర బాబు , ఉలవపాడు మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు రావినూతల రమేష్ బాబు వివిధ మండలాల నేతలు ఉన్నారు.



ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యా వ్యవస్థలో మార్పులు : ఇంటూరి

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : విద్యా వ్యవస్థను సమూల మార్పులు శ్రీకారం చుట్టడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలి పారు. వలేటివారిపాలెం హైస్కూల్లో పూర్వ విద్యార్థి గుత్తా మధుబాబు రూ 2.50 లక్షలతో నిర్మించిన సభావేదికను ఎంఎల్ఎ నాగేశ్వరరావు సోమవారం ప్రారంబించారు. అనంతరం హైస్కూల్ హెచ్ఎం కమల్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావంతో మధుబాబును ఆదర్శంగా తీసుకొని పాటశాలల అభివద్ధికి దోహదపడాలని చెప్పారు. ఎంతో ఉన్నతాశయంతో సభావేదిక నిర్మాణానికి సహకరించిన మధుబాబుతో పాటు కుటుంభ సభ్యులను ఎంఎల్ఎ నాగేశ్వరరావు అభినందించారు. విద్యా వ్యవస్థలో మంత్రి లోకేషబాబు పెను మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద విద్యారులతల్లిదండ్రుల ఖాతాలో రూ 10 వేల కోట్లు జమ చేసి, చెప్పిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకొందని తెలిపారు. కార్యక్రమం అనంతరం పలువురు ఉపాధ్యాయులు, నాయకులు ఎమ్మెల్యే నాగేశ్వరావును ఘనం గా సత్కరించారు. డిప్యూటీ డి ఈ ఓ నరసింహరావు. దాత గుత్తా నరసింహం, మాజీ జడ్పిటిసి కూచిపూడి విజయ్ కుమార్ న్యాయవాది వలేటి శ్రీధర్ నాయుడు, ఎం ఈ ఓ మల్లికార్జునరావు, ఎంపీడీఓ నరేంద్రదేవ్, ఆర్ఏ ప్రసాద్, వైద్యాదికారి శివశిద్ధప, ఎస్ఐ మరిదినాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాను ఆం జనేయులు, చెరువుపల్లి మాల్యాద్రి, వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, గుత్తా కొండయ్య, వలేటి మధుసూదన్ రావు కొంకా రమేష్ కాకుమాను హర్ష, కాకుమాను మాల్యాద్రి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి



దాతను సన్మానిస్తున్న దృశ్యం

స్మార్ట్ మీటర్లపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం




స్మార్ట్ మీటర్ల పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మరింత భారం మోపుతుందని పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలకు అవగాహన కలిగించేందుకు సోమవారం ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారు. ప్రస్తుతం అదానికి లాభాలను సమకూర్చేందుకు ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారన్నారు. పార్టీ తరపున స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ప్రయత్నాన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం ఆపకపోతే సబ్ స్టేషన్లను ముట్టడిస్తామని పార్టీ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు చల్ల కొలుసు మల్లికార్జున రావు, ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జానీ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, పార్టీ నాయకులు పడవల సుబ్రహ్మణ్యం, పముజుల శుభ కుమార్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కోవూరు : స్మార్ట్ మీటర్ల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మరింత భారం మోపుతుందని సిపిఎం మండల కమిటీ పేర్కొంది. స్థానిక సీతా పోలయ్య భవనంలో సిపిఎం నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. మండలంలో పది పంచాయతీలలో ప్రతి ఇంటికీ కరపత్రాన్ని పార్టీకార్యకర్తలు అందించాలన్నారు. ఆదాని స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపుఇవ్వాలని వాడవాడలా ప్రచార క్యాంపెయిన్ నడపాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శేషయ్య, నాయకులు బుజ్జయ్య, సుబ్బారావు, బాబు, హరి, పెద్దబ్బయ్య, అప్రోజ్, మల్లికార్జున్ రెడ్డి, చాన్‌బాషా, ఫాతిమా, సురేంద్ర, ఎజ్దానీ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



ప్రజాశక్తి-బిట్రగుంట : దళితుల భూముల సమస్యలను పరిష్కరించా లని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే సందర్భం గా బోగోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ నాగులవరం, చెన్నారెడ్డిపాలెం గ్రామాల్లో భూములు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. కేశవరపు కుమారస్వామి సర్వే నెంబర్ 333 సర్వేనంబర్‌లో ఉన్న భూమిని చేరెడ్డి సుబ్బరామిరెడ్డి, తండ్రి సుబ్బారెడ్డి ఆక్రమించుకున్నారని తెలిపారు. కుమారస్వామి ఉపాధి పనుల కోసం చెన్నై వెళ్లిందని, ఆమె పొలంను ఆక్రమించుకొని 15సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. తాను భూమిని అమ్మడం కాని ఇవ్వడం కాని చేయలేదని, పక్క భూమిని ఆక్రమించుకొని దానిని కూడా ఆక్రమించుకొన్నారని తెలిపారు. తొలగించాలే దళితుల అంటే అవమానంగా మాట్లాడుతున్నారని తెలిపారు. దళితుల భూములు ఒక్కొక్క రెడ్లు 25 ఎకరాల దాకా ఆక్రమించుకొని ఉన్నారని తెలిపారు. 1981లో సిజెఎఫ్ఎస్ కింద 3ఎకరాల చొప్పున పంపిణీ చేశారన్నారు. ఈ పంపిణీ చేసిన భూములు మొత్తం కూడా గ్రామ పెత్తందారులు ఆక్రమించుకొని సాగుబడి చేసుకుంటున్నారు. కుమారస్వామి ఎవరికి అమ్మలేదని తహశీల్దార్‌కు విన్నవించగా విచారణ జరుపుతామని, ఎవరి భూములు అన్యాక్రాంతమైన తిరిగి తీసుకుంటామని తహశీల్దార్ వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్డా వాసు, ఆత్మకూరు తేజ, భూముకున్నవారైన కేశవరపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు పట్నం నుంచి పల్లెకు..



ప్రజాశక్తి - ఉదయగిరి : సాధారణంగా చదువుల కోసం విద్యార్థులను వారి తల్లిదండ్రులు పల్లెల నుంచి పట్టణాలకు పంపుతారు కానీ ఇక్కడ పట్టణం నుంచి ప్రభుత్వ విద్య కోసం పల్లెకు విద్యార్థులు వస్తూ ఉండడం పై ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బారెడ్డిని ఉపాధ్యాయురాలు ప్రశాంతి కుమారిని పలువురు అభినందిస్తున్నారు. మండల పరిధిలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఉదయగిరి నుంచి పదిమంది విద్యార్థులు వస్తున్నారు. ఉపాధ్యాయురాలు ప్రశాంతికుమారి వారి భర్త రమేష్ చొరవతో పదిమంది ఉదయగిరి నుండి పుల్లాయపల్లికి వస్తున్నారు. వీరిని ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు గాజులపల్లె సుబ్బారెడ్డి ఉపాధ్యాయురాలు ప్రశాంతికుమారి తమ సొంత వాహనాల్లో జాగ్రత్తగా తీసుకొని వస్తున్నారు. ఆటోలను నమ్మకుండా స్వయంగా ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి పదిమంది విద్యార్థులను కారులో పాఠశాలకి తీసుకొని వస్తున్నారు. వీరందరూ గతంలో పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలల్లో చదువుతూ ఉండటం కొసమెరుపు దానితో గ్రామంలో విద్యార్థుల శాతం పెరగడంతో గ్రామస్తులు గ్రామపెద్దలు వారిని అభినందిస్తున్నారు. దాతలు గ్రామస్తులసాయంతో పాఠశాలలను ఇంకా అభివృద్ధి చేస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఎంఎల్ఎను కలిసిన జిల్లా ఉద్యమ నేత




ప్రజాశక్తి-ఉదయగిరి : కొత్తగా జిల్లాల పునర్విభజన చేపట్టిన సందర్భంగా ఉదయగిరి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని ఉదయగిరి జిల్లా ఉద్యమనేతలు వైద్యులు వేణుగోపాల్ కోరారు. సోమవారం కావలిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కె.వేణుగోపాల్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం కొత్తగా ఉదయగిరి జిల్లా ఏర్పాటుపై పున:సమీక్షించాలని నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని వెనబడిన 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరిని జిల్లాగా చేయాలని కోరారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన సోమశిల హైలెవెల్ కాలువ ద్వారా గానీ, వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా గానీ సాగుజలాలు పారలేదని తాగు, సాగునీరు లేక మెట్టప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఇక్కట్లు పాలవుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. విద్య, వైద్య, రవాణా తదితర సౌకర్యాలు లేక ఈ ప్రాంతప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు మురళి, రషీద్, నాని పాల్గొన్నారు.

రాయితీతో డ్రోన్ సరఫరా

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని పందిపాడు గ్రామానికి చెందిన 5మంది కలిసి ఏర్పాటు చేసుకున్న శ్రీ వెంకటేశ్వర రైతు సేవా కేంద్రంకు డ్రాగో కంపెనీకి డ్రాగ్కి చెందిన రూ.9.8లక్షల డ్రోన్‌ను 80శాతం రాయితీతో రూ.7.80లక్షలకు సరఫరా చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సురేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రోన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 80శాతం సబ్సిడీలో ఈ డ్రోన్‌ను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మిగిలిన రైతులు కూడా రైతు మిత్ర గ్రూపులుగా ఏర్పాటు చేసుకొని పైరు మీద వచ్చే పురుగు, తెగుళ్లను సమర్థవంతంగా నివారించుకొని అధిక ఆదాయమును పొందాల్సినదిగా కోరుతున్నామన్నారు.

టియుసిసి పతాకావిష్కరణ



ప్రజాశక్తి-కావలి : నేతాజీ మున్సిపల్ కార్మికులు యూనియన్ (టియుసిసి) యూనియన్ పతాకావిష్కరణ కార్యక్రమం కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టియుసిసి కేంద్ర కమిటీ సభ్యులు టి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగింది. కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట టియుసిసి పతాకావిష్కరణ అనంతరం అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వి సుందరరామరాజు ప్రసంగిస్తూ 1920 నాటి కార్మిక చట్టాలను కూడా నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, ఉద్యోగ భద్రత లేకుండా, పని గంటలు, కనీస వేతనాలు వేతన ఒప్పందాలు జరిగిన దాఖలాలు కనిపించడం లేదని, ప్రభుత్వాలు బాధ్యతారా రాహిత్యంగా వ్యవహరిస్తున్న కారణంతో ప్రభుత్వ అధికారులు కూడా అదేబాటలో నడుస్తున్నారన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకోవాలని, అందుకోసం టియుసిసి రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం నరసింహరావు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అంతర్జాతీయ, జాతీయ గుర్తింపు పొందిన కార్మిక సంఘం టియుసిసి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కావలి నేతాజీ మున్సిపల్ కార్మికుల యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు కావలి యేసు, కావలి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాజకీయ ఒత్తిడితో ఔట్సోర్సింగ్ కార్మికులకు భద్రత లేకుండా పోయిందని యూనియన్ అండతో కార్మికుల భద్రతకు కార్మికులు పెద్దఎత్తున కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధరావత్ రవి, శెట్టిపల్లి ఆదిలక్ష్మి, ఎస్.ఎలమందలయ్య, కావలి కొండమ్మ, కావలి ఆదిశేషయ్య, శెట్టిపల్లి హైమావతి, శెట్టిపల్లి కొండయ్య, కర్రేటి కోటేశ్వరమ్మలతోపాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డును నిర్మిచాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఆత్మకూరు పురపాలక వంద పడకల గవర్నమెంట్ ఆసుపత్రి ఉత్తరం వైపు ఉన్న రోడ్డును నిర్మించి వెంకట్రావుపల్లి బైపాస్ రోడ్డుకు కలపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు అన్నారు. సోమవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజ్ విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ ప్రాంగణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉత్తరం గోడ వైపున ఉన్న రోడ్డును మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌లో కనపరిచేన పాత 100అడుగుల రోడ్డును పునరుద్ధరించి వెంకట్రావుపల్లి - నర్సాపురం - శాంతినగర్ ప్రజలకు రాకపోకలకు అనువుగా రోడ్డు నిర్మించాలని ప్రజలు పక్షాన సిపిఎం పట్టణ కమిటీ కోరుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆత్మకూరు పట్టణంలో ప్రధాన రహదారి నుండి వెంకటరావుపల్లి - బైపాస్ రోడ్డుకు కలుపుతూ లింక్ రోడ్డు లేదు. లింక్ రోడ్డు లేనందున వెంకట్రావుపల్లి, నరసాపురం, శాంతినగర్, వెంకట్రావుపల్లి ఎస్‌టి కాలనీ ప్రజలు హాస్పిటల్‌కు వచ్చి వైద్యం చేయించుకునేందుకు రెండు ఆటోలు మారాల్సిన పరిస్థితి ఆ ప్రాంత ప్రజలకు ఏర్పడి ఉందన్నారు. ఆటో ఖర్చులకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. తద్వారా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అసౌకర్యాన్ని పరిశీలించి మున్సిపల్ కమిషనర్ పరిశీలించి వెంకట్రావుపల్లి, బైపాస్ రోడ్డును లింక్ చేస్తూ 100 అడుగుల సిసి రోడ్డు నిర్మాణం నిర్మించాలన్నారు. శాశ్వత రోడ్డు నిర్మాణం చేసేలోపు జంగిల్ క్లియర్ చేసి మెటల్ రోడ్డునైనా ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, పాదాచారులకు ఇబ్బంది లేకుండా ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ప్రజల పక్షాన సిపిఎం పట్టణ కమిటీ కోరుతున్నట్లు తెలిపారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరినట్లు ఆయన తెలిపారు.

బ్రిడ్జిలు నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-నెల్లూరు



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నెల్లూరు రూరల్ మండలం లోని పొట్టేపాలెం, ములుమూడి గ్రామాల కలుజులపై బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ సిపిఎం నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నెల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు బంది తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధనలు మాట్లాడుతూ గత మూడురోజుల నుంచి పొట్టేపాలెం కలుజువద్ద ధర్నా నిర్వహించామని తెలిపారు. ఈ కలుజుపై ప్రతిరోజు ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజలు 12వేల వాహనాలలో షుమారు 50వేల మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. నెల్లూరు చెరువులో నుంచి కలుజుపై ఉధృతంగా ప్రవహించే నీటి ప్రవాహం వల్ల అనేక మంది వాహనాలు కొట్టుకుపోవడం గాయాలయ్యి హాస్పిటల్ పాలవుతున్నారు, సెల్ఫోన్లు పడి పోయి నీటి పాలవుతున్నాయన్నారు. కాబట్టి రాబోయేది వర్షాకాలం కనుక పొట్టేపాలెం, ములుమూడి కలుజులపై బ్రిడ్జిలను నిర్మించి ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాల్సిందిగా సంబంధిత అధికారుల కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు శ్రీపతి వెంకయ్య, శ్రీపతి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు ఆపలేరు.. : సిపిఎం

ప్రజాశక్తి-కావలి

ఉలవపాడు మండలం కరేడు గ్రామాల రైతులు తమ భూములు ఇండోసోల్ కంపెనీకి ఇవ్వమని, సుమారు నెల రోజుల నుండి పోరాటం చేస్తున్నారని, రైతులు భూములు ఇవ్వమని చెబుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలు ఉపయోగించి బలవంతంగా భూములు తీసుకోవాలని చూడడం చాలా దుర్మార్గమైన విషయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పసుపులేటి పెంచలయ్య అన్నారు. కరేడు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి ఉంటారని ఈ గ్రామాలలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని, భూములు కోల్పోతే అక్కడ పేదలు జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. రామకృష్ణాపురంలో గిరిజన మహిళల మధ్య వచ్చిన చిన్నతగాదాను ఆసరాగా తీసుకొని టిడిపి నాయకుల అండతో ముగ్గురు గిరిజన మహిళలపై అక్రమంగా కేసుపెట్టి, రిమాండ్‌కు పంపడం భూ పోరాటాలకు అండగా నిలిచిన జి.వి.బి.కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలందరికీ మంచి పరిపాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వం రైతుల పచ్చటి పొలాలను ఇండోసోల్ కంపెనీకి వేల ఎకరాల భూమిని కట్టబెట్టి అక్కడ రైతులను వ్యవసాయ కూలీలను ఇబ్బందులు పెట్టాలని చూడడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజలు భూములు ఇవ్వమంటే నిర్బంధాలను ఉపయోగించడం ఏమి న్యాయమని కరేడు రైతులు చేస్తున్న పోరాటం న్యాయమైందని రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలను ఉపయోగించి బెదిరించి రైతుల దగ్గర భూములు తీసుకోవాలని చూడడం మానుకోవాలని అక్రమ పోలీసు నిర్బంధాలను కేసులను ఆపాలని డిమాండ్ చేశారు.



ఎన్నికైన ఐద్వా నూతన కమిటీ

మహిళలకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-దుత్తలూరు

మండలంలోని చింతలగుంట గ్రామంలో మహిళలకు ఉపాధి కల్పించాలని ఐద్వా నాయకులు పేర్కొన్నారు. స్థానిక మహిళలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి శివకుమారి, షేక్ మస్తాన్ బీ మాట్లాడుతూ చింతలగుంట గ్రామంలోని మహిళలు వెనుకబడిన వర్గానికి చెందిన వారిని పేద కుటుంబాలని రోజువారి కూలి పనులకు వెళ్లి కుటుంబాలను జరుపుకుంటున్నారని, కావున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వారికి పనులు కల్పించాలన్నారు. స్థానిక మహిళలు అందరూ పొదుపు గ్రూపులో నిర్వహించుకుంటున్నారని కావున పొదుపు మహిళలందరికీ ప్రభుత్వం ద్వారా కుట్టు సెంటర్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఆ విధంగా వారికి ఉపాధి కల్పించాలని కోరారు. చింతలగుంట గ్రామంలో 9 మందితో మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా బి రమ్య, కార్యదర్శిగా డి లీలమ్మ ఎన్నికయ్యారు.

ప్రజాసంక్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి-అల్లూరు



కరపత్రాలు అందజేస్తున్న ఎంఎల్ఎ కావ్య, ఎంఎల్‌సి బీద

నిత్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇందూపూరు, పురిణి గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్‌సి బీద రవిచంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఇందూపూరు గ్రామంలో రూ.25.90 లక్షల నిధులతో చేపట్టిన అంతర్గత సిమెంట్ రోడ్లు, రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే పురిణి గ్రామంలో రూ.14.50 లక్షలతో నిర్మించినఅంతర్గత సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ తల్లికి వందనం, పింఛన్లు వంటి పథకాల అమలుపై ప్రజలను అడిగి వారి అభిప్రాయాలు సేకరించారు.కార్యక్రమంలో అల్లూరు మండల టీడీపీ అధ్యక్షులు బండి శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంబటి రాజేంద్ర, నాయకులు రేబాల శంకర్ రెడ్డి, బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, హరికృష్ణ, సామంతుల కిరణ్ రెడ్డి, ఇందూపూరు గ్రామ సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, బూత్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మద్దతుగా నిరసన ర్యాలీ


ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్



నిరసన తెలియజేస్తున్న కార్మికులు నాయకులు

నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై దౌర్జన్యం చేసి లాఠీచార్జి చేసిన పోలీసులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య పేర్కొన్నారు. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై పోలీసు ధమన కాండను నిరసిస్తూ సోమవారం సాయంత్రం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి నిరసన ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు నగరంలోని కొన్ని డివిజన్‌లలో పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల శాంతియుత సమ్మెను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేదయపాలెం పోలీస్‌స్టేషన్ పోలీసులు హఠాత్తుగా మున్సిపల్ కార్మికులపై దౌర్జన్యం చేసి లాఠీచార్జి చేసి సుమారు 30మంది కార్మికులను గాయపరిచారన్నారు. మహిళలపై నాయకులను అరెస్టు చేశారని తెలపారు. పోలీసుల దౌర్జన్యం చేయడానికి నాయకులు తీవ్రంగా ఖండిస్తూ లాఠీచార్జికి పాల్పడిన సిఐ, పోలీసుల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీల ప్రయివేటీకరణను నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికులపై వారి సమస్యలపై ఇదే వైఖరిని కొనసాగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, యూనియన్ నాయకులు జి.నాగేంద్ర, యు గురవయ్య, చినబాబు, యుఇఐయు నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీ



ప్రజాశక్తి మర్రిపాడు : మండలంలోని పలు మద్యం షాపులను ఎక్సైజ్ ఎస్ఐ ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం దుకాణంలో స్టాక్ రిజిస్టర్ అమ్మకాలు ధరలు తదితర విషయాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే మద్యం అమ్మాలని సూచించారు. నిబంధనలు వ్యతిరేఖిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రకృతి వ్యవసాయంతో పండిన పంటలను తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలమని ప్రకృతి వ్యవసాయ రైతులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో వారు విక్రయాలు చేపట్టారు. కార్యక్రమంలో గండిపాలెం, అప్పసముద్రం, నార్త్ కొండాయపాలెం రైతులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో గోలే.చంద్రశేఖర్ 17వ వర్ధంతి సందర్భంగా సోమవారం కావలి పట్టణం నివాసులు వృత్తి రీత్యా విదేశాల్లో ఉంటున్న వారి అక్కయ్య, బావ వాకాటి. మహేంద్ర-శ్రీదేవి దంపతులు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా పాత వినాయక గిరిజన కాలనీలో 100 పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ వాకాటి మహేంద్ర - శ్రీదేవి తాము పుట్టిన గడ్డపై ఉన్న అభిమానంతో సంయుక్త సేవాసంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా సంస్థ ద్వారా చేస్తున్న సేవలకు తమ వంతు సాయం అందిస్తూ తోడ్పాటునిస్తున్నారని తెలిపారు.

పశువులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-సీతారాంపురం : థైలేరియా వ్యాక్సినేషన్‌ను పాడి రైతులందరూ వినియోగించుకోవాలని పశు వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్ర శర్మ సూచించారు. సోమవారం సీతారాంపురం గ్రామంలో పశువులకు తైలేరియా యాక్షన్ చేపట్టారు. కార్యక్రమంలో దెయ్యాల శ్రీనివాసులు, ఉప్పుటూరి శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు

ప్రజాశక్తి-కావలి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలతో సోమవారం 20వ వార్డ్ మాజీ కౌన్సిలర్ పాలడుగు అనురాధ నివాసం వద్ద నుండి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. కో క్లస్టర్ ఇన్‌ఛార్జులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, తిరువీధి ప్రసాద్, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు కావేటి శివకుమార్, రాయపాటి దిలీప్‌కుమార్, 89వ, 90వ పిఎస్ కన్వీనర్లు పసుపులేటి చంద్రశేఖర్, ఒంగోలు ప్రభు చరణ్, కో కన్వీనర్ సాయి, అలహరి నరసింహారావు, నరహరి సుబ్బారావు, శిఖరం సురేష్, నువ్వుశెట్టి రూపేష్, టిడిపి కార్యకర్త పాలడుగు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో ఉన్న గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఛలో కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి తమ సమస్యలను గిరిజనులు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ పడమటి కంభంపాడు గ్రామంలో దాదాపు 30 సంవత్సరాల నుండి గిరిజనులు సోమశిల ఉత్తర కాలువ పక్కన గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. కంప చెట్ల మధ్య పాములు, తేళ్లు వంటి విష పురుగుల మధ్య జీవిస్తున్నారని తెలిపారు. కరెంట్ స్తంభాలు వేశారు కానీ స్తంభాలకు కరెంట్ సప్లై ఇవ్వలేదన్నారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇవ్వాలని, ఇళ్లు లేక గుడిసెలో ఉన్నారని వారికి పక్కా కాలనీ ఇళ్లు మంజూరు చేసి నిర్మించాలన్నారు. జంగిల్ క్లీనింగ్ ద్వారా కంప చెట్లు తొలిగించాలని, మంచి నీటి సౌకర్యం, రోడ్లు నిర్మించి గిరిజన కాలని అభివృద్ధి చేయాలన్నారు. కలెక్టర్ స్పందించి గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారని తెలిపారు. చలో కలెక్టరేట్‌లో ఆ గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల్లో ఎంఎల్ఎ



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం మొగల్ హబీబ్ బేగ్ షాదీ మందిర్‌లో ఆదివారం రాత్రి "రాక్ అండ్ రోల్" డ్యాన్స్ మాస్టర్ కలర్స్ మున్నా డ్యాన్స్ 23వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొనడంతో సభా ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. డ్యాన్సర్స్‌తో ఎంఎల్ఎకు మున్న డ్యాన్స్ మాస్టర్, కళాకారులు, వార్డు నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. డ్యాన్స్ మాస్టర్ మున్నా ఆధ్వర్యంలో జరిగిన డ్యాన్స్ ప్రోగ్రాం ఎంఎల్ఎ తిలకించారు. ఎంఎల్ఎపై కంపోజ్ చేసిన స్పెషల్ సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి కళాకారులను అభినందించి ఘనంగా సన్మానించారు. ఎంఎల్ఎ చేతుల మీదగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కలర్స్ మున్న డ్యాన్స్ టీం ఎంఎల్ఎను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని మున్న ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాడని కావలి నియోజకవర్గంలో ఉన్న కళాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.

మెగా జాబ్‌మేళాకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ఆగస్టు 1, 2 తేదీల్లో ఆత్మకూరు ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను స్వయంగా ఆయన పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం రామ నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు జాబ్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు తెలిపారు. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, బద్వేల్, వెంకటగిరి నియోజకవర్గ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.పావని, టిడిపి సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, డి.ఎస్.పి వేణుగోపాల్, సీఐ గంగాధర్, మున్సిపల్ చైర్పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న జలదంకి మండల టిడిపి నేతలు

ఎంఎల్ఎ కాకర్లపై ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-కావలి

ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌పై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని వారికి తగిన బుద్ధిచెప్పి తీరుతామని జలదంకి మండల టిడిపి కన్వీనర్ పులుగుంట మధుమోహన్ రెడ్డి, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రా రెడ్డి, టిడిపి ఉదయగిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు పూనూరు భాస్కర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కరియావుల అప్పల నాయుడులు హెచ్చరించారు. సోమవారం కావలి పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో వారు జలదంకి మండలంలోని టిడిపి నేతలతో కలిసి,మీడియా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మునగాల వెంకటేశ్వర రెడ్డి, పున్నం రోసిరెడ్డి, ఉన్నం రవి, జాజుల శివరామయ్య, కంచర్ల వినోద్ నాయుడు, బడే వెంకటేశ్వర్లు రెడ్డి, శెట్టిపల్లి శ్రీనివాసులు, గునుపాటి బాబుల్ రెడ్డి, మరికొంతమంది సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట గ్రామానికి చెందిన షేక్ రహమత్ తండ్రి నజీర్ అహ్మద్ అను వ్యక్తికి వైద్య సేవల నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.70400 దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు, ఎఎస్‌పేట మండల ఉపాధ్యక్షులు పులిమి సుధాకర్ రెడ్డి, మంత్రి ఆనంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

In the Court of the Principal Junior Civil Judge : Nellore
O.S.No. 127 / 2024

Veluru Vijay - Plaintiff
Vs
1. Vakati Subbamma and another - Defendants

Notice

To,
D1. Vakati Subbamma, W/o **V.Chandra,**
D2. Vakati Chandra S/o **V.Veeraswamy,**
D1 & D2 are residing at No.20/1A-8-78-97, Vuyyala Kaluva Katta, Parameswari Nagar, Nellore-1.

పై నెంబరున వాది మీ నుండి దావా బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే20-08-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Md. Azam Hussain, M.Com., B.L.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the VII Addl. District Judge : Gudur
E.P.No. 28 / 2024
ARC / HDB / VL / 20148 / 2022

HDB Financial Services Ltd., Rep. by its GPA Holder **M.Srihari** - DHR
Vs
1. Vanipenta Srikanth and another - JDRs

Notice to 1st JDR

Vanipenta Srikanth,
S/o **Erukala Reddy Vanipenta,**
Mogalluru Village, Podalakur Mandal, SPSR Nellore District.

పై నెంబరున డిక్రీ హోల్డరు డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు 1వ జెడిఆర్ తాలూకు స్థిరాస్తిని జప్తుచేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు ఆర్డర్ 21 రూల్ 54 (1ఎ) నోటీసు నిమిత్తం **తే22-08-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

డి.ఎస్.వి.రామకృష్ణ కుమార్, B.Com., B.L.,
డిక్రీహోల్డరు తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the Senior Civil Judge : Gudur
O.S.No. 37 / 2024

Vallamkonda Revathi - Plaintiff
Vs
1. Vallamkonda Venkata Jhansi Latha and 2 others - Defendants

Notice to 2nd Defendant

Vallamkonda Pavan Sandeep,
S/o Late **V.Ramanaiah,** residing at Door No.10-15-338/62, GNT Road -4, Kavali and Kavali Mandal, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోట్ల బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే13-08-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.లింగమూర్తి, M.B.A., L.L.M.,
బి.బాలప్రదీప్, M.B.A., L.L.M.,
వాది తరపు అడ్వకేట్స్, గూడూరు.

In the Court of the III Addl. Junior Civil Judge : Nellore.
O.S.No. 548 / 2022

Canara Bank, Brindavanam Branch, Nellore, represented by its **Branch Manager** - Plaintiff
Vs
1. Goutham Enterprises, Rep. by its Prop. **P.Venkata Seshaiah** and another - Defendants

Notice

To,
D1. Goutham Enterprises,
Rep.by its Prop: **P.Venkata Seshaiah,**
S/o **Sankaraiah,** Residing at Vengamamba Layout, Phase No.2, Flat No.2, No-29, Godown No.2, Goutham Street, Beside NH-5, Navalak Gardens, Nellore. SPSR Nellore District.
D2. B. Sujatha Padmalatha,
W/o **P.V. Seshaiah,**
Residing at Vengamamba Layout, Phase No.2, Flat No.2, No-29, Godown No.2, Goutham Street, Beside NH-5, Navalak Gardens, Nellore. SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే25-08-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి, అందుకు అవసరమైన చికిత్సలు తీసు కోవడం వల్ల అంగవైకల్యాన్ని అధిగమిం చడం సాధ్యమౌతుందని జిల్లా కుష్టు , ఎయిడ్స్ , టిబి అధికారి డాక్టరు ఎస్ ఖాదర్‌వలి అన్నారు. సోమవారం సంబంధిత విభాగాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవారీ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రభుత్వ లక్ష్యాలు అధిగమించేందుకు చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా గుర్తించిన కుష్టి వ్యాధిగ్రస్తులను వారికి అందుతున్న ట్రీట్మెంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి వారికి తగు విధమైన చికిత్స అందించి అంగవైకల్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, అంగవైకల్యము ఉన్నవారికి యస్ యస్ ఓ డి ద్వారా అంగవైకల్యాన్ని నిర్మూలి ంచాలని అవస రమైన వారికి శాస్త్ర చికిత్సలు నిర్వహిం చాలన్నారు. కొత్తగా కనుగొన్న కేసులకు వారితో నివాస ముంటున్న వారికి వ్యాధి ప్రబలకుండా పెప్ మింగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు, టిహెచ్ వార్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు మరియు డీపీఎంఒలు డి ఎఫ్ ఐ టి ఏ ఓ సతీష్ , మల్లమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపరిధిలోని పడుగుపాడు పంచాయతీ ఎన్టీఆర్ గిరిజన కాలనీలో సోమవారం సబ్ యూనిట్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై మరింత అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి స్వాతి, హెచ్ఎస్. సురేష్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన


ప్రజాశక్తి-నెల్లూరు

జాతీయ డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కార్పొరేషన్ హైస్కూల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు కీటక జనిత వ్యాధులు - సంక్రమణ - దోమలు పుట్టకుండా కుట్టకుండా తీసుకోవలసిన చర్యలు గురించి వివరముగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు వేదమూర్తి , ఉపాధ్యాయులు, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మలేరియా పట్టణ విభాగం సిబ్బంది, ఎంపిహెచ్‌ఎ (ఎం), సచివాలయం ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు

శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా తటవర్తి వెంకటేశ్వర్లు, బీబీ జానమ్మ (కందుకూరు వాసవి వనిత క్లబ్ ట్రెజరర్) గార్ల కుమార్తె తటవర్తి హేమంత సౌమ్య లక్ష్మీ మీనా కుమారి పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే యాచకులకు,నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియల్ చైర్మన్.కోట వెంకటేశ్వర్లు, ఇన్నమూరి శ్రీనివాసులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.నైట్ వాచ్మెన్, అటెండర్ పోస్టులను గ్రామ రెవెన్యూ సహాయకుల చేత భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో గ్రామ రెవెన్యూ సహాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆహారం అందజేస్తున్న దృశ్యం

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు మండలం లేగుం టపాడు దళితవాడ ప్రాంతంలో సోమవారం ఇనమడుగు ప్రభుత్వ హోమియో వైద్యులు కరుణాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వర్షాకాలం సీజన్లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడమే కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకో వాలన్నారు.హోమియోలో అనేక జబ్బులను నయం చేసే మందులు ఉన్నాయన్నారు. వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ సందర్భంగా ఈ శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్ పరిశీలించి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీమ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు నగరం

నగర వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారని, అధికారులు పరిష్కరించే చర్యలు చేపట్టాలని, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.మున్నా కోరారు. స్థానిక సంతపేట సిపిఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనకమహల్ సెంటర్ నుండి విఆర్ సి సెంటర్ వరకు అనేక షాపింగ్ మాల్స్, హోటళ్ల వెలిశాయని తెలిపారు. ముఖ్యంగా పలు షాపింగ్ మాల్స్, హోటళ్లకు పార్కింగ్ స్థలాలు లేవని ఆరోపించారు. దీంతో షాపింగ్ మాల్స్, హోటళ్లకు పార్కింగ్ స్థలాలు లేక రోడ్ల పైన వాహనాలను ప్రజలు పార్కింగ్ చేస్తున్నారన్నారు. రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలత్తకుండా చూడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రోడ్ల ప్రక్కన చిరు వ్యాపారాలు, నాలుగు చక్రాల బండ్లపై వ్యాపారాలు నిర్వహిస్తుంటే పోలీసు, మున్సిపాలిటీ అధికారులు వాళ్లపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. సమావే శంలో సర్దార్, షాజహాన్, కరిముల్లా, వాసుదేవ రెడ్డి, మీరా అహ్మద్ పాల్గొన్నారు.

బంకు ఏర్పాటుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: చర్చి స్థలాన్ని ఆక్రమించి, బంకు పెట్టి దౌర్జన్యానికి పాల్ప డుతున్నారని సోమవారం గ్రీవెన్స్ సెల్ లో కలెక్టర్ కు ఫిర్యాదు అందింది. వివరాల మేరకు.. స్థానిక దళిత వాడలోని కృపా ఆరాధన మందిరం స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన పా ముల చిన్నయ్య కుటుంబ సభ్యులు ఆక్రమించి, ఆ స్థలంలో బంకు ఏర్పాటు చేశారని చర్చ్ సభ్యులు క లెక్టర్ కు ఫిర్యాదు చేశారు. చర్చి ముందు బంకు ఏర్పా టు చేయ డంతో ప్రార్థనలకు ఆటంకం కలుగుతోందని సంఘస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

కోటేశ్వరరావుకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి -ఉలవపాడు: మండలం కరేడు పంచాయతీ ఆకుతోట సంఘం మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న బి. కోటేశ్వరావును ఆకుతోట సంఘం గ్రామస్తులు ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్ మాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి 2 పి.వి రమణయ్య, పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కరేడు కస్టర్ ప్రధానోపా ధ్యాయుడు పి. శ్రీనివాసులు ఎస్.ఎం.సి వైస్ చైర్మన్ శిరీష, మాజీ చైర్మన్ మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. కోటేశ్వరరావు, మనిషా బాబు గోపాల్ రెడ్డి, ఈ.వెంకటేశ్వ రరావు, విద్యా కమిటీ సభ్యులు గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



చెన్నయ్- నాయుడుపేట రైలు పొడిగించండి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రస్తుతం చెన్నయ్- సూళ్లూరు పేట మధ్య నడుస్తున్న ఇఎంయు రైల్ సేవలను నాయుడు పేట వరకు పొడిగించాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నకి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో సోమన్నను కలిసిన ఎంపి వేమిరెడ్డి నాయుడుపేటలోని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇచ్చిన వినతి పత్రాన్ని అందించారు. నాయుడు పేటతో సహా తిరుపతి జిల్లాలోని చుట్టుపక్కల మండ లాలు, గ్రామాల నివాసితులు, ఉద్యోగులు, వ్యాపార వ్యక్తులు, సాధారణ ప్రజల విజ్ఞప్తి మేరకు చెన్నై-సూళ్లూరుపేట మధ్య నడుస్తున్న ఇఎంయు రైలు సేవలను నాయుడుపేట వరకు పొడిగించడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



"బీద"కు గౌరవం


ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సభ్యులతో 2025-26 సంవత్సరానికి ఏర్పాటు చేసిన ఉభయ సభల సంయుక్త కమిటీలలో శాసనమండలి సభ్యులు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రకు చోటు దక్కింది. వెనుకబడిన వర్గాల(బీసీ) సంక్షేమ కమిటీ చైర్మన్ మరియు శాసన మండలి సభా నియమాల కమిటీ సభ్యుడిగా బీద రవిచంద్ర నియమితు లయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పలు బీసీ సంఘాల నేతలు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలతో బీద రవిచంద్ర ని సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో భారత సాంకేతిక విద్యా సమితి భాగస్వామ్యంతో ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇండస్ట్రియల్ ఐఓటీ అనే అంశంపై రెండవ సంవత్సరం ఈసీఈ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ యు. పెంచలరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంబెడెడ్ సిస్టమ్స్, వీటితో పాటు ఇండస్ట్రియల్ ఐఓటీ రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త జి. కిరణ్ కుమార్ ఇండస్ట్రియల్ ఐఓటీ రంగాల్లో పరిశ్రమలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ఇటువంటి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రావణ్‌కుమార్ పలు సూచనలు చేశారు.



డాక్టరు ఎం.నరేంద్ర ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-నెల్లూరు

కోవిడ్ -19 సమయంలో జిజిహెచ్‌లో ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఎంతో మంది కోవిడ్ వ్యాధిగ్రస్తులకు తన ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించి, జిజిహెచ్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి తిరుపతి రుయా వైద్యశాలకు ఇటీవల బదిలీపై వెళ్లిన డాక్టరు ఎం.నరేంద్ర గుండె పోటుకు గురై ఆకస్మిక మృతి చెందారు. సోమవారం ఆయన తిరుపతి రుయా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదురుగా నడుచు కుంటూ వెళుతూ సడన్గా హార్ట్ స్ట్రోక్ కు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే డాక్టర్లు చికిత్సలు అందజేసినప్పటికీ ఫలితం లేకపోయింది. రాష్ట్రంలోనే సమర్థవంతమైన నోడల్ ఆఫీసర్ గా డాక్టర్ నరేంద్ర గారిని గుర్తించడం రాష్ట్రస్థాయిలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు అందరూ ప్రశంసలం దుకున్నారు. ఆయన మరణ వార్త తెలిసి ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల ప్రక్రియలో తిరుపతికి ట్రాన్స్ఫర్ అయ్యారన్నారు. వేలాది మంది ప్రాణాలు కాపాడిన గొప్ప డాక్టర్ నరేంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఏపీ హంస గౌరవ అధ్యక్షులు డాక్టర్ వై వెంకటేశ్వర్లు, ఏపీ హంస జిల్లా జనరల్ సెక్రెటరీ కమల్ కిరణ్ తెలియజేశారు

ఖరీఫ్ సీజన్ కార్యాచరణ ప్రణాళికపై చర్చ

ప్రజాశక్తి-నెల్లూరు

ఖరీఫ్ సీజన్ 2025-26కు గాను కార్యచరణ ప్రణాళికపై వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులతో వ్యవసాయ శాఖ అధికారి పి.సత్యవాణి సమావేశం నిర్వహించారు.సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆత్మపరిధిలో శిక్షణ, ప్రదర్శన క్షేత్రాలు, విజ్ఞాన యాత్రలు, జిల్లా, రాష్ట్ర స్థాయి రైతు క్షేత్ర పాఠశాలలు, శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి చర్చలు, క్షేత్ర సందర్శనలు, క్షేత్ర దినోత్సవాలు, కిసాన్ మేళాలు, ఇతర సంబందిత కార్యక్రమాల నిర్వహణపై సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో డిపిడి ఆత్మ ఐ.మురళి, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త వినీత, ఔటిడిపి అధికారి జెవి.దీపిక తదితరులు పాల్గొన్నారు.